క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: చెట్ల కొమ్మల తొలగింపు విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా నగరంలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ అన్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ షిరిడీ సాయినగర్, లక్ష్మీనరసింహ నగర్, శ్రీపాదవారి వీధి, వడ్డెర కాలనీ, అఫీషియల్ కాలనీ, శాంతారామ్ హాస్పిటల్ ఏరియా, సాయిబాబా గుడి ఏరియా, కంచర లైన్, కొత్తపేట, మెయిన్ రోడ్డులో విద్యుత్ ఉండదన్నారు.

10న బ్రాహ్మణ కార్తిక వన సమారాధన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మహిళలు

సీటీఆర్ఐ: నగర బ్రాహ్మణ కార్తిక వన సమారాధనను నవంబర్ 10వ తేదీన ఆంధ్ర కేసరి కళాశాలలో నిర్వహిస్తామని నగర మహిళా ఉపాధ్యక్షురాలు కొండూరు రాజశ్రీ తెలిపారు. ఏవీ అప్పారావు రోడ్డులోని పెమ్మరాజు భవనంలో సోమవారం నగర బ్రాహ్మణ మహిళా సభ జరిగింది. ప్రయోగ రమాదేవి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ నగరంలోని బ్రాహ్మణులందరూ వనసమారాధనకు తరలిరావాలని కోరారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఎం.సుమతి నివాస్, రమాదేవి, రామాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చాంబర్ డైరెక్టర్‌గా గట్టి ప్రభు



రాజమహేంద్రవరం సిటీ: ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్‌గా గట్టి ప్రభును నియమించినట్టు అధ్యక్షుడు తవ్వా రాజా, ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ సోమవారం ప్రకటించారు. ఫ్రూట్స్ అండ్ లెమన్ మర్చంట్ అసోసియేషన్ తరఫున ఆయనను ఏకగ్రీవంగా ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా గట్టి ప్రభును డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆకుల వీర్రాజు, చాంబర్ ఉపాధ్యక్షుడు ఒంటెద్దు సూరిబాబు, మాజీ డైరెక్టర్ వలవల దుర్గాప్రసాద్ అభినందనలు తెలిపారు.

బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా జయసింహ



రాజమహేంద్రవరం సిటీ: ది రాజమండ్రి చాంబర్స్ డైరెక్టర్ దొండపాటి జయసింహ 2024–2027 కాలానికి గాను ఏపీ బులియన్ గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చాంబర్ కామర్స్ ట్రస్ట్ (స్వచ్ఛంద సంస్థ) అధ్యక్షుడు, ఏపీ బులియన్ గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్స్ మర్చంట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దొండపాటి శంకరరావు కుమారుడే జయసింహ. ఆయన ఇటీవల చాంబర్ ఎన్నికల్లో డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. జయసింహకు ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తవ్వా రాజా, గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ తదితరులు అభినందనలు తెలిపారు.

సుబ్బారాయుడి కుటుంబ సభ్యులకు పరామర్శ



సుబ్బారాయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు మాజీ సర్పంచ్ ఆచంట వెంకట సుబ్బారాయుడి కుటుంబ సభ్యులను సోమవారం డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. ముందుగా సుబ్బారాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కొత్తపల్లి నాగేశ్వరరావు, పెనుమాక సునీల్, నక్కా ధనరాజు, మానుకొండ వెంకటరావు ఉన్నారు.

రిక్షా కార్మికుడిపై బ్లేడ్ బ్యాచ్ దాడి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రిక్షా కార్మికుడిపై బ్లేడ్ బ్యాచ్ సభ్యులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. మంగళవారపుపేట కొబ్బరికాయల మార్కెట్ వద్ద సోమవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. తాడితోటకు చెందిన 71 ఏళ్ల చెల్లుబోయిన రామకృష్ణ రిక్షా తొక్కుతుంటాడు. సోమవారం తెల్లవారుజామున కొబ్బరికాయల మార్కెట్‌లో లోడు వేసుకోవడానికి వెళ్లాడు. మార్కెట్ తెరవడానికి ఇంకా సమయం ఉండడంతో అక్కడే రోడ్డు పక్కగా నిద్రించాడు. ఈలోపు ఇద్దరు యువకులు వచ్చి డబ్బులు అడిగారు. లేవని చెప్పిన రామకృష్ణపై బ్లేడులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అతడిని స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

మన్నుగడ కష్టమే!

- కూటమి ప్రభుత్వంలో పెరిగిన ఎర్రమట్టి ధర
- నర్సరీ రైతుల అవస్థలు
- అదనపు భారమవుతోందని ఆవేదన



నర్సరీ మొక్కల పెంపకంలో కీలకమైన ఎర్రమట్టి

కడియం: కూటమి ప్రభుత్వంలోని జనసేన, టీడీపీ ప్రజాప్రతినిధులు నర్సరీ రైతుల విషయంలో పెదవులపై మాత్రమే ప్రేమను చూపిస్తున్నారని కడియం ప్రాంత నర్సరీ రైతులు భావిస్తున్నారు. నర్సరీల్లో మొక్కలను పెంచుకునేందుకు అత్యంత కీలకమైన ఎర్రమట్టి ధరల విషయంలో ఇది బయటపడిందని చెప్పుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో కంటే సుమారు 2 నుంచి 4 వేల రూపాయల వరకు మట్టికి అధికంగా చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదనంగా వసూలు

కడియం ప్రాంత నర్సరీలకు జగ్గంపేట, పండిగి, సూరంపాలెం తదితర ప్రాంతాల నుంచి ఎర్రమట్టిని తీసుకువస్తారు. మట్టితో పాటు రవాణా చార్జీలు, ఖర్చులను కలుపుకొని 5 యూనిట్ల లారీకి గతంలో రూ. 9,500 నుంచి రూ.10 వేలు చెల్లించాల్సి వచ్చేది. అదే అయిదు యూనిట్ల లారీ ఇప్పుడు రూ.15 వేల వరకు పలుకుతోంది. గతంలో రూ.10 వేల నుంచి రూ.12 వేలకు లభించినప్పుడు కూడా మైన్స్ సెస్సుగా రూ.1900 వసూలు చేసేవారు. ఇప్పుడు కూడా మైన్స్ సెస్సును బూచిగా చూపించి ఉద్దేశపూర్వకంగానే మట్టి ధరలను పెంచుతున్నారని రైతులు చెబుతున్నారు. సెస్సును తొలగించి మట్టిని అందించాలని కోరుతుంటే సెస్సును అలాగే ఉంచి, అదనంగా ధరలు పెంచడం ఎంత వరకు సమంజసమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎకరానికి..

ఎకరా విస్తీర్ణంలో మొక్కలను బ్యాగుల్లో పెట్టి పెంచేందుకు 8 నుంచి 9 లారీల ఎర్రమట్టి అవసరమవుతుంది. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం ప్రతి ఎకరాకు రూ. 50 వేల వరకు రైతులకు అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. సీజన్‌లో మొక్కల ఎగుమతులు అయ్యాక, ప్రస్తుతం ఖాళీగా ఉన్న చేలను మొక్కలతో నింపాలంటే రైతులు ఈ అదనపు పెట్టుబడి కారణంగా బెంబేలెత్తిపోతున్నారు. ఒక వేళ చేనును ఖాళీగా ఉంచలేక.. కొందరు రైతులు ఎక్కువ ధర చెల్లించేందుకు సిద్ధపడినప్పటికీ ప్రస్తుతం మట్టి మాత్రం లభించడం లేదు. జనసేనకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర మంత్రివర్యులు కందుల దుర్గేష్, టీడీపీకి ప్రాతినిధ్యం వహిస్తున్న గోరంట్ల బుచ్చయ్య చౌదరిలకు కడియం ప్రాంత నర్సరీ రైతాంగంపై ప్రత్యేక అభిమానాలున్నాయి. ఈ విషయాన్ని ప్రతి సమావేశంలో చెబుతుంటారు. అయినప్పటికీ రైతులకు ఎర్రమట్టి ధరల కారణంగా ఏర్పడుతున్న ఇబ్బందులను మాత్రం తొలగించే ప్రయత్నాల్లో ఎందుకు సఫలం కాలేకపోతున్నారన్న ప్రశ్న రైతాంగం నుంచి వినిపిస్తోంది.

రూ.50 వేలు అదనంగా పెట్టాలి

ఎకరానికి 8 నుంచి 9 లారీల ఎర్రమట్టి అవసరమవుతోంది. ప్యాకెట్ సైజును బట్టి మట్టి అవసరం పెరుగుతుంది. లారీని అదనంగా రూ. 4 వేల నుంచి 5 వేలు ఎక్కువ పెట్టి కొనుగోలు చేయాలంటే ప్రతి ఎకరాకు రూ. 50 వేల వరకు పెట్టుబడి పెట్టాలి. మొక్కల అమ్మకాలు ఆశించినంతగా లేవు. రేట్లు పెరుగుదల ఇలాగే కొనసాగితే కడియం ప్రాంత నర్సరీ రంగ మనుగడపై ప్రభావం పడుతుంది.

– సీహెచ్‌వీ సత్యనారాయణ, నర్సరీ రైతు

ప్లాంటేషన్ నిలిపివేస్తున్నారు

మొక్కల ఎగుమతులు పూర్తయిన చేలల్లో ప్రస్తుతం ప్లాంటేషన్ కార్యక్రమాలు మొదలవ్వాలి. కానీ మట్టి రేటు కారణంగా ప్లాంటేషన్ చేయించడానికి రైతులు వెనకడుగు వేస్తున్నారు. మట్టి రావడం లేదు. లారీ ధర రూ.15 వేలు చెబుతున్నారు. దీంతో పెట్టుబడి పెరిగిపోతోందని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పుడు ప్లాంటేషన్ చేయకపోతే సీజన్‌కు మొక్కలను అందించలేరు. ఇది రైతులు, కూలీలతో పాటు అందరికీ ఇబ్బందే.

– జి.వీరబాబు, నర్సరీ కూలీ

ఇది కూటమి ట్యాక్స్!

ఎర్రమట్టిపై ప్రస్తుతం అదనంగా పెరిగిన ధరలు కూటమి ట్యాక్సేనని కడియం ప్రాంత నర్సరీ రైతులు భావిస్తున్నారు. మెట్ట ప్రాంతానికి చెందిన ఒక ఎమ్మెల్యే కుమారుడికి రూ.2 వేలు, ఆయన పీఏకు రూ.500, పైవారికి రూ.2 వేలు చెల్లించాలని బాహాటంగా అక్కడి వారు చెబుతున్నారని తెలుస్తోంది. ఈ కారణంగానే ఎర్రమట్టి ధరలను అకారణంగా పెంచుతున్నారని చెప్పుకుంటున్నారు.

అవినీతి నిర్మూలనకు సమష్టి కృషి



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం రూరల్: అవినీతికి సంబంధించిన సందర్భాల్లో అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు అన్నారు. విజిలెన్స్‌డేను పురస్కరించుకొని సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో జిల్లా అధికారులతో కలిసి సంస్థల కోసం సమగ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ అవినీతిని నిర్మూలించడంలో అన్ని అంశాలలో సమగ్రత, పారదర్శకత, సుపరిపాలన, అత్యున్నత ప్రమాణాలకు మనమందరం ముందుండి నాయకత్వం వహిద్దామన్నారు. నైతిక వ్యాపార పద్ధతులను ప్రోత్సహిస్తూ, నిజాయితీ, సమగ్రత సంస్కృతిని పెంపొందించుకుందామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ తామరాల సీతారామమూర్తి, పర్యాటకశాఖ ఆర్డీ స్వామి నాయుడు పాల్గొన్నారు.

గంజాయితో మహిళ అరెస్టు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గంజాయి కలిగి ఉన్న సుబ్బారావు నగర్‌కు చెందిన టీకి భవానీని సోమవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఆమె నుంచి 50 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన



సభలో మాట్లాడుతున్న జాతీయ కన్వీనర్ రామకృష్ణ

కంబాలచెరువు: ఉద్యమాలు, పోరాటాలతోనే హక్కులను సాధించుకోగలమని పీడీఎస్‌యూ 50 వసంత మేఘగర్జన జాతీయసభలో పలువురు వక్తలు అన్నారు. స్థానిక ఆనం రోటరీ హాల్లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో బిగిపిడికిలి జెండాను పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ ఆవిష్కరించారు. ముందుగా అమర వీరులకు విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు. ప్రధాన వక్త ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం 1974లో ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ నాయకత్వంలో ఏర్పడిందన్నారు. దేశ వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాడి ఎన్నో విజయాలు సాధించిందన్నారు. సంఘ జాతీయ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ సభలో మాట్లాడుతూ ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు దేశ విద్యారంగంలో అమలు చేయడం వలన విద్యార్థులకు సామాజిక స్పృహ లేకుండా పోతుందన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, అక్కూ ప్రొఫెసర్ సత్యనారాయణ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు పి.టాన్యా మాట్లాడుతూ సమాజంలో అసమానతలు, వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలన్నారు. చీకట్ల వెంకటేశ్వరరావు, టి.ప్రకాష్, అనసూయ, పీగనిరాజు, వి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల కమీషన్లు తగ్గించడం తగదు



ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద మహాధర్నా చేస్తున్న రూరల్ బ్రాంచ్ ఏజెంట్లు, యూనియన్ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: ఎల్ఐసీ ఏజెంట్లకు కమీషన్ తగ్గించడం, అది కూడా ఆరేళ్లకు సర్దుబాటు చేయడం, పాలసీదారులకు ప్రవేశ వయసు కుదించడం వంటి వాటిని తక్షణం విరమించుకోవాలని లియాఫీ రాజమండ్రి డివిజన్ అధ్యక్షుడు రావుల మాధవరావు డిమాండ్ చేశారు. అఖిల భారత లియాఫీ ఇచ్చిన పిలుపు మేరకు మోరంపూడిలోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద రూరల్ బ్రాంచి యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రావుల మాధవరావు మాట్లాడుతూ ఎల్ఐసీ ఏజెంట్లు తమ న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన తెలియజేస్తూ వస్తున్నారని, దీనిలో భాగంగా మహాధర్నా చేపట్టడం జరిగిందన్నారు. రూరల్ బ్రాంచ్ యూనియన్ అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా మాట్లాడుతూ 1956 నుంచి ఏజెంట్లకు ఇస్తున్న కమీషన్లను పెంచకపోగా తగ్గించడమేమిటని ప్రశ్నించారు. ఖాతాదారులకు పెనుభారంగా మారిన జీఎస్టీని రద్దు చేయాలన్నారు. అనంతరం ఎల్ఐసీ మేనేజ్‌మెంట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జీకే చంద్రశేఖర్, ఈ.రవికుమార్, వై.రామ్మోహన్, మట్టా సత్యనారాయణ, అక్కిరెడ్డి సూరిబాబు, కేఎన్ రామకృష్ణ, అమీరిశెట్టి ఏసు, ఎ.కృష్ణ పాల్గొన్నారు.

మెయిన్ బ్రాంచి వద్ద..

అఖిలభారత లియాఫీ పిలుపు మేరకు ఎల్ఐసీ ఏజెంట్లు సోమవారం రాజమహేంద్రవరంలోని మెయిన్ బ్రాంచి వద్ద ధర్నా చేశారు. అసోసియేషన్ రాజమండ్రి డివిజన్ పూర్వ కార్యదర్శి కొప్పిశెట్టి శ్రీనివాసరావు, మెయిన్ బ్రాంచి పూర్వ అధ్యక్షులు పీవీఎస్ కృష్ణారావు, మెయిన్ బ్రాంచ్ ప్రెసిడెంట్ గండిబోయిన శ్రీనివాస్, సెక్రటరీ పట్నాల శ్రీనివాస్, కోశాధికారి ముక్తవరపు సత్యసాయిబాబా, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

మగ్గం వర్క్ శిక్షణ ప్రారంభం



మెటీరియల్‌ను అందజేస్తున్న సుంకర వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: మగ్గం వర్క్ శిక్షణను వినియోగించుకుని ప్రతి మహిళా ఆర్థికంగా ఉన్నతి సాధించాలని వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత డాక్టర్ సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. మోరంపూడి సాయినగర్‌లో వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మగ్గం వర్క్ శిక్షణను ఆయన ప్రారంభించారు. ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణకు 60 మంది మహిళలు హాజరయ్యారన్నారు. అనంతరం వారికి వర్క్ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో శిక్షకురాలు కోనేలక్ష్మి, ఫౌండేషన్ సభ్యులు మణి, కీర్తి, సంధ్య, మీనా, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

వినికిడి యంత్రాల నమోదుకు 137 మంది హాజరు

రాజమహేంద్రవరం రూరల్/కంబాలచెరువు: జిల్లా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలోని జిల్లా సత్వర చికిత్సా కేంద్రంలో సోమవారం నిర్వహించిన వినికిడి యంత్రాల నమోదు ప్రక్రియకు 137 మంది హాజరయ్యారని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. రాష్ట్రీయ బాలస్వాస్థ్య, దీన్ దయాళ్ శ్రావణ ఫౌండేషన్ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ 116 మంది పెద్దలు, 21 మంది 18 ఏళ్లలోపు పిల్లలు స్క్రీనింగ్‌కు వచ్చారని, అర్హులైన త్వరలో వినికిడి యంత్రాలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్య ప్రభ, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ హరిశ్చంద్ర, దీన్‌దయాళ్ శ్రావణ ఫౌండేషన్ తరఫున స్టేట్ కన్సల్టెంట్ రవితేజ, డాక్టర్ సౌజన్య, డాక్టర్ విశ్వనాథ్, ఆడియోలాజిస్ట్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆటపాటలతో బోధన అభినందనీయం



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సూర్యప్రభావతి తదితరులు

సీటీఆర్ఐ: బడిలో ఉత్సాహంగా లేని విద్యార్థులను గుర్తించి, వారికి ఆటపాటలతో విద్యను నేర్పిస్తున్న పార్ట్ ఇండియా సంస్థ సేవలు అభినందనీయమని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ సూర్యప్రభావతి అన్నారు. సీతంపేటలోని పంతం సత్యనారాయణ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో సోమవారం పార్ట్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. చదువుపై ఆసక్తి లేని విద్యార్థులకు ఆటపాటలతో సాయంత్ర వేళలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సీఎఫ్‌సీ సంస్థ ఇన్‌చార్జి అమీర్ పాషా, హెచ్‌ఎం చైతన్య కుమార్, పార్ట్ ఇండియా మేనేజర్ వీరభద్రరావు, భూమిక కుమారి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి కందుకూరి స్ఫూర్తి కావాలి



స్వర్ణోత్సవంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్ తదితరులు

మంత్రి కందుల దుర్గేష్

సీటీఆర్ఐ/కంబాలచెరువు: ప్రతి విద్యార్థి సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం స్ఫూర్తిగా తీసుకోవాలని ఏపీ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కందుకూరి వీరేశలింగం ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవాన్ని సోమవారం స్థానిక ఆనందోద్యాన వనంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. తొలుత వీరేశలింగం విగ్రహానికి ముఖ్యఅతిథి మంత్రి దుర్గేష్ నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, అనేకమంది విద్యార్థుల జీవితాలకు కందుకూరి కళాశాల పునాదిగా నిలిచిందన్నారు. బూజు పట్టిన పాత భావాల్ని రూపుమాపి, ప్రజా జీవితాల్ని చైతన్యవంతం చేసిన కందుకూరి వీరేశలింగం సేవలు మరపురానివని కొనియాడారు. అనంతరం కళాశాలలో స్వర్ణోత్సవ పైలాన్‌ను ఆవిష్కరించారు. మంత్రిని పలువురు సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.ఎబెల్ రాజబాబు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- ఎస్పీ నరసింహ కిశోర్
- వైద్య, రక్తదాన శిబిరాల ప్రారంభం



శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ డి.నరసింహ కిషోర్ సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ స్మారకోత్సవాలలో భాగంగా సోమవారం జాంపేటలోని పోలీసు కన్వెన్షన్ హాల్లో కిమ్స్ బొల్లినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి, కుటుంబ సభ్యులకు మెగా వైద్య శిబిరం, జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వీటిని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రక్తదానం చేసి పోలీసు సిబ్బంది, యువతకు, విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారు.

400 మందికి వైద్య పరీక్షలు

వైద్య శిబిరంలో కిమ్స్ బొల్లినేని హాస్పిటల్ సీఈవో, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎన్ఎస్ రామరాజు, కిమ్స్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణ రామ్మోహన్, జాయింట్స్ ఆర్థోపెడిక్స్ సర్జన్ డాక్టర్ ఆనంద చౌదరి, డాక్టర్ దీపక్‌తో పాటు క్యాన్సర్, యూరాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, పిడియాట్రిక్స్, గైనిక్, కార్డియాలజీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, గ్యాస్ట్రో ఎంటరాలజీ, అంకాలజీ విభాగాలకు చెందిన డాక్టర్లు సుమారు 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

రక్తదాన శిబిరం

ఎన్‌టీఆర్ ట్రస్టు బ్లడ్‌బ్యాంకు, సంజీవని వలంటరీ బ్లడ్ సెంటర్ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీతో పాటు, పోలీసు సిబ్బంది, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదాతలకు పండ్లు, సర్టిఫికెట్లను ఎస్పీ నరసింహ కిశోర్ చేతుల మీదుగా అందజేశారు. వైద్యశిబిరాన్ని పర్యవేక్షించి అడిషనల్ ఎస్పీ (లా అండ్‌ఆర్డర్) అల్లూరి వెంకట సుబ్బరాజు, డీఎస్పీ (ఏఆర్) రవికుమార్, ఇన్‌స్పెక్టర్ (ఎస్‌బీ) అనసూరి శ్రీనివాసరావు, ఇతర అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

బదిలీపై వెళుతున్న కానిస్టేబుళ్లకు సత్కారం



బదిలీపై వెళుతున్న కానిస్టేబుళ్లతో సీఐ గణేష్, ఎస్సై హరిబాబు తదితరులు

ధవళేశ్వరం: పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచేలా సిబ్బంది విధులు నిర్వర్తించాలని సీఐ టి.గణేష్ సూచించారు. ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ బదిలీ అయిన పోలీసు సిబ్బందిని సోమవారం ఘనంగా సన్మానించారు. ఏఎస్సై నాగేశ్వరరావుతో పాటు 16 మంది కానిస్టేబుళ్లు వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు.

రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు

కడియం: జేగురుపాడులో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పలువురు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఫిర్యాదు చేశారు. గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ మహాలక్ష్మి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

రైల్వే బాక్స్ బాయ్స్‌ను తొలగించడం అన్యాయం

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే స్టేషన్‌లో 25 ఏళ్లుగా బాక్స్ బాయ్స్‌గా పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమని, వెంటనే వారికి రైల్వేలో పని కల్పించాలని జిల్లా రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఫెడరేషన్ యూనియన్ కార్యదర్శి బీవీఎన్ పూర్ణిమరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ మేనేజర్ రంగనాథన్‌కు వినతిపత్రం అందజేశారు.

విశాఖ ఉక్కు రక్షణకు అండగా నిలవండి

కంబాలచెరువు: విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ, కడప స్టీల్ ప్లాంట్ సాధనకు విశాఖపట్నంలో జరుగుతున్న విద్యార్థి, యువజన కన్వెన్షన్‌ను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఆ కార్యక్రమ పోస్టర్‌ను శ్యామల సెంటర్‌లోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్, డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు, కో కన్వీనర్ డి.అశోక్ మాట్లాడారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపుతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కనీసం మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కనక పాల్గొన్నారు.

వివాహితను కాపాడిన బొమ్మూరు పోలీసులు

రాజమహేంద్రవరం రూరల్: ఆత్మహత్య చేసుకోవడానికి ఇంటి నుంచి వచ్చేసిన వివాహితను బొమ్మూరు పోలీసులు కాపాడారు. వివరాల్లోకి వెళితే.. బొమ్మూరుకు చెందిన 22 ఏళ్ల వివాహితకు భర్తతో విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోవడానికి సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వచ్చేసింది. ఈ విషయాన్ని ఇంటిలోని డైరీలో రాసింది. వెంటనే ఆమె తల్లిదండ్రులు బొమ్మూరు పోలీసులను ఆశ్రయించారు. స్పందించిన ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్, సిబ్బందితో కలిసి వివాహిత వద్ద ఉన్న ఫోన్ ఆధారంగా ఆమె పిచ్చుకలంక వద్ద ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లి ఆమెను రక్షించి తీసుకువచ్చారు. ఆమె భర్త, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. వివాహితను కాపాడిన పోలీసు సిబ్బందిని ఎస్పీ నరసింహ కిశోర్ అభినందించారు.

రోడ్ల విస్తరణకు ప్రణాళికలు

రాజమహేంద్రవరం సిటీ: రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లను విశాలంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఆయన సోమవారం నగరంలోని కోరుకొండ రోడ్డు, తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డును అధికారులతో కలసి పరిశీలించారు. పుష్కరాలకు పుణ్యస్నానాలు ఆచరించేందుకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి అసౌకర్యంగా లేకుండా ఉండేందుకు రోడ్లను వెడల్పు చేయాల్సి ఉందన్నారు. కాగా.. నగరపాలక సంస్థలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 20 అర్జీలు వచ్చినట్టు కమిషనర్ తెలిపారు.

సినిమాలు



శ్యామల	:	వేట్టయన్
సూర్యమినీ		జనక అయితే గనక
సూర్యప్యాలెస్	:	వెనమ్
శివజ్యోతి	:	పొట్టేల్
అనుశ్రీ	:	వెనమ్
స్వామి	:	వెనమ్
అశోక	:	విశ్వం
రాజా	:	వెనమ్
రంభ	:	ప్రేమకావాలి, సత్యం సుందరం
ఊర్వశి	:	లగ్గం
మేనక	:	మార్టిన్
కుమారి	:	దేవర
అప్సర	:	దేవర
నామవరం వీఎస్ మహల్	:	వెనమ్
ధవళేశ్వరం మురళీకృష్ణ	:	వెనమ్
కడియం వెంకటసూర్య	:	వెనమ్